క్లుప్తంగా

చేతివృత్తిదారులను ఆదుకోవాలి

ఆత్మకూరు: ప్రభుత్వాలు చేతి వృత్తి దారులను ఆదుకోవాలని రాష్ట్ర చేతి వృత్తుల సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. స్థానిక సుదర్శన వర్మ భవనంలో శుక్రవారం చేతివృత్తిదారుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృత్తి దారులకు బడ్జెట్ కేటాయించాలన్నారు. నాయకులు రాంనాయక్, రణధీర్, సురేంద్ర, సిద్దయ్య, గణపతి, శివుడు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం పదిలం

కొత్తపల్లి: క్రీడలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సర్పంచ్ ఎర్రం చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. శుక్రవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శివపురం గ్రామంలో మండల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఆయా గ్రామాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయని చెప్పారు. విజేతలకు వరుసగా.. రూ.7,016, రూ.5,016, రూ.3,016 అందజేస్తామని పేర్కొన్నారు.

రాయలసీమకు నికరజలాలు అందించాలి

మహానంది: రాయలసీమకు నికరజలాలు అందించాలని బుక్కాపురం రైతులు బాబు, పుల్లయ్య, నంది శ్రీనివాసులు కోరారు. ఈ నెల 28న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న చలో సిద్ధేశ్వరం కార్యక్రమానికి మద్దతుగా శుక్రవారం బుక్కాపురంలో కరపత్రాలు విడుదల చేసి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాయలసీమలో కరువును పారద్రోలాలంటే నికర జలాలు కావాలని, చెరువులు, కుంటల ఆక్రమణలు తొలగించి నీటితో నింపాలని డిమాండ్ చేశారు. సిద్ధేశ్వరం వద్ద బ్యారేజీ కం వంతెన నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, మౌలాలి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెలుగు ఫోక్ యాప్ ప్రారంభం

శ్రీశైలంప్రాజెక్ట్: తెలుగు ఫోక్ ఆడియో మొబైల్ యాప్‌ను సున్నిపెంటలోని శ్రీ గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం కమిటీ సభ్యులు ప్రారభించారు. అపరిమిత భక్తి, జానపద గీతాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. శ్రీశైల మల్లన్న, శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, భక్త రామదాసు, అన్నమయ్య కీర్తనలు, లలిత సహస్ర నామం, లక్ష్మీదేవి స్తోత్రం , శివ స్తోత్రం, గాయత్రీ మంత్రం, పూజా విధానాలతో పాటు జానపద గీతాలు అందుబాటులో ఉన్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. సభ్యులు ఎం.నాగరాజు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.


చేతిపంపులకు మరమ్మతులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో సర్పంచ్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు రామలింగేశ్వరరెడ్డి ముస్లిం మైనార్టీ కాలనీలో శుక్రవారం చేతి పంపులకు మరమ్మతు చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్ పనులను పరిశీలించారు. గ్రామంలో ఎక్కడ కూడా తాగు నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు.

సీఐటీయూ జెండావిష్కరణ

పాములపాడు: స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు ఐకమత్యంగా ఉండాలని కోరారు. సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేయాలని సూచించారు. బెంగళూరులో ఆలిండియా మహాసభలు జరుగనున్నాయని తరలిరావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా నాయకులు రామ్‌నాయక్, నాయకులు స్వామన్న, పరమేష్, విజయ్, మాబాషా పాల్గొన్నారు.

'తూడిచెర్ల'కు 650 క్యూసెక్కుల నీటి సరఫరా



మల్యాల వద్ద కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

జూపాడుబంగ్లా: తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 650 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 800, మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి 680 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారని చెప్పారు. రైతులు వినియోగం తర్వాత లాకిన్స్ లాకు 800 క్యూసెక్కుల నీరు చేరుతుండగా అందులో అలగనూరు బ్యాలెన్సింగ్ కాల్వకు 150, తూడిచెర్ల సబ్‌చానల్‌కాల్వకు 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

కొత్తపల్లి: గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి భ్రమరాంభ గూడెం, ఎర్రమఠం సచివాలయం పరిధిలోని పాతమాడుగుల గూడెంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ కొత్త ఆధార్, ఆధార్‌కార్డులో చేర్పులు, మార్పులు, మొబైల్ నెంబర్ యాడింగ్, బయోమెట్రిక్ అథెంటికేషన్ వంటి వాటిని సరిచేసుకోవచ్చన్నారు. గూడేలలో నెట్‌వర్క్ సమస్య తలెత్తడంతో సచివాలయాల్లోనే సేవలందిస్తున్నారని చెప్పారు. ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు ఉన్నారు.

మహిళా చైతన్యంతో సమాజాభివృద్ధి



భోగి మంటలను వెలిగిస్తున్న ప్రజాప్రతినిధులు



ముగ్గులు వేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మహిళల చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి పెద్దపీట వేశారని నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణ హౌసింగ్ బోర్డు కాలనీలోని జైజవాన్ పార్కులో ముగ్గుల పోటీలు ప్రారంభించారు. ముందుగా చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మహిళలు పార్కులో భోగి మంటలను వెలిగించి సంప్రదాయ బద్ధంగా భోగి మంట చుట్టూ కోలాటమాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 175 మంది పాల్గొనగా, హౌసింగ్ బోర్డు కాలనీలోని సిమెంటు రోడ్లు రంగవల్లులతో నిండిపోయాయి. విజేతలకు శనివారం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి బహుమతులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వాణి, చింత తులసమ్మ, అబ్దుల్‌రవూఫ్, రాధిక, లక్ష్మీదేవి, చింత లక్ష్మీదేవి, జెడ్పీటీసీలు పుల్యాల దివ్య, కలీమున్నిసా, ఎంపీపీలు మల్లు వెంకటేశ్వరమ్మ, మల్లీశ్వరి, సువర్ణమ్మ, కుసుమలత, నాయకురాళ్లు దాసి అనసూయమ్మ, సలోమి, సూదిరెడ్డి రాధ, అఖిల్, నాయకులు స్వామిదాసు, రవికుమార్, పెరుమాళ్ల శ్రీనాథ్, రవీంద్రారెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలు..: ముగ్గుల పోటీల విజేతలను ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వెల్లడించారు. విజేతలు వరుసగా.. పి.శ్రీవాణి, సుజాత, పి.సుజాత, జి.లలితాభాయ్, బి.మంజులవాణి, జి.లావణ్య, బి.రమ్యను ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరితో పాటు కన్సోలేషన్ బహుమతి కింద 20 మందిని ఎంపిక చేశామన్నారు.

కాళికాంబ దేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరీష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రి పాల్గొన్నారు.

కర్ణాటక ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



కర్ణాటక ముఖ్యమంత్రి బొమ్మైకి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలంలో నిర్వహిస్తున్న రాష్ట్రీయ ధర్మజాగృతి మహా సమ్మేళనానికి కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప శుక్రవారం హాజరయ్యారు. బెంగళూరు నుంచి విమానంలో కర్నూలు ఓర్వకల్లు విమాశ్రయానికి చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12:45 గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. వీరి వెంట ఆ రాష్ట్ర కేబినెట్ మంత్రులు గోవింద్ కర్జోల్, మురుగేస్ నిర్ణాని ఉన్నారు. వీరికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్రీయ ధర్మ జాగృతి మహా సమ్మేళన ప్రతినిధులు జగదీష్, గురురాజ్ చారంతిమత్, హర్షగుట్టేదార్, కౌసిక్, బసయ్య మహాలింగపురమత్, ప్రశాంతి దుగ్గతీమత్ ఉన్నారు. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప తదితరులు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన శ్రీశైలం చేరుకున్నారు. పలు అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సాయంత్రం 5:30 గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరి వెళ్లారు.

తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలి



చీనీ మొక్కలను పరిశీలిస్తున్న క్లస్టర్ ఏపీడీ అన్వరా బేగం

పగిడ్యాల: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని క్లస్టర్ ఏపీడీ అన్వరా బేగం ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపురంలో జరిగే ఉపాధి పనులను పరిశీలించారు. పని ప్రదేశంలోని కూలీల హాజరును పర్యవేక్షించి కొలతల ప్రకారం పనులు చేయాలని ఆదేశించారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ ఇచ్చిన కొలతల మేరకు పనిచేస్తే రోజుకు రూ. 257 వస్తుందని చెప్పారు. అనంతరం పండ్ల తోటల పెంపకం కింద నాటిన మొక్కలను పరిశీలించి వంద శాతం మొక్కలను బతికించుకోవాలని రైతుకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, ఈసీ అశోక్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం అంబమ్మ

జూపాడుబంగ్లా: పొదుపు మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం అంబమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని మండ్లెం గ్రామంలో గ్రామైక్య సంఘాల అధ్వర్యంలో పొదుపు మహిళలకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళలు పొదుపు చేసుకొన్న సొమ్ముతో పాటు బ్యాంకులు, డ్వాక్రా సంఘాల్లో వచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని కుటీర పరిశ్రమలు స్థాపించుకొని జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. బర్రెలు, పొట్టేళ్లు, ఆవుల పెంపకంతో పాటు కిరాణం కొట్టు, తినుబండారాలు, పచ్చళ్ల తయారీ, కుట్టుమిషన్, అల్లికలు వంటి చేతి వృత్తులను స్వయం ఉపాధిరంగాలను నెలకొల్పుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు గాంధీ, నాగన్న, నాగేశ్వరరావు, ధన్‌సింగ్, జయలక్ష్మి, జయపాల్, కర్రెన్న, బాలస్వామి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభం



తలపడుతున్న క్రీడాకారిణులు

బండిఆత్మకూరు: సంక్రాంతి వేడుకల్లో భాగంగా నారాయణాపురం గ్రామంలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ యండూరి సరిత, ఆమె భర్త యండూరి లింగారెడ్డి పోటీలను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొడుగు నాగేశ్వరరావు పోటీలను ఏర్పాటు చేశారు. హర్యానా, తమిళనాడు రాష్ట్రాలతో పాటు అనంతపురం, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి 14 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు వరుసగా రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు అందజేస్తామని నిర్వాహకుడు నాగేశ్వరరావు తెలిపారు.

ముగ్గుల పోటీలు



మహిళలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పగిడ్యాల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పడమర ప్రాతకోట కాశీ విశ్వేశ్వర స్వామి తిరుణాల వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 45 మంది మహిళలు, చిన్నారులు పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సమతయశోదర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హిమబిందు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామలమ్మ, సర్పంచ్ శేషమ్మ, నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు బహుమతులు అందజేశారు.

సెమీ ఫైనల్‌కు చేరిన జూపాడుబంగ్లా జట్టు



సెమీ ఫైనల్‌కు చేరిన క్రికెట్ జట్టు

జూపాడుబంగ్లా: సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న నియోజవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో జూపాడుబంగ్లా జట్టు సెమీ ఫైనల్ చేరింది. మొత్తం 75 జట్లు పోటీల్లో పాల్గొనగా మిడ్తూరు, పగిడ్యాల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలాల్లో పోటీలు నిర్వహించారు. నాలుగు మండలాల్లో గెలుపొందిన నాలుగు టీంలు సెమీ ఫైనల్లో పాల్గొంటాయి. స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన పోటీల్లో 18 జట్లు తలపడ్డాయి. వైఎస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, నాయకులు సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వినయ్, సుంకన్న పాల్గొన్నారు.

• మల్లన్నకు నృత్య నివేదన



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై తెనాలికి చెందిన కల్యాణి కూచిపూడి ఆర్ట్ అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో జయగణేశ, భో..శంభో, శంభో శంకర, యోగేశ్వరాయ, అయిగిరి నందిని తదితర గీతాలకు వందన, బ్రాహ్మణి, మైత్రి, చరిత, జ్యోషిత, ప్రణవి, కల్పన, సహస్రశ్రీ , ఆరాధ్య, హరిప్రియ, జ్యోత్స్న, మోక్షజ్ఞ, యుక్త, భవజ్ఞ, కార్తిక తదితరులు నృత్యం చేశారు.

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శామూన్ చిత్రంలో ఎస్పీ రఘువీర్ రెడ్డి, జేసీ నిశాంతి

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఈ నెల 20వ తేదీన పాణ్యం మండలం నెరవాడకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీశైల దేవస్థానంలోని సీసీ కంట్రోల్ రూంలోని సమావేశ మందిరంలో పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ ఈ నెల 20న పాణ్యం మండలం నెరవాడ గ్రామంలో గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. గిరిజనుల జీవనశైలి, అభివృద్ధి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి సమీక్షిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించిన సివిల్ పనులు, అప్రోచ్ రోడ్డు, భూమి చదును, షామియానా, లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ వివరాలు తదితర ఏర్పాటన్నీ రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. నెరవాడ గ్రామంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ట్రైబల్ స్కూల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, ఆర్డీఓలు శ్రీనివాసులు, ఎం.దాసు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో ఉపాధి పనులు



పంట కాల్వను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

బండిఆత్మకూరు: గిరిజన గూడేల్లో గిరిజనులకు ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం నాయిని చెరువు చెంచు గూడెం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో గిరిజనులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉపాధి పనులు జరిగేవని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏలో కాకుండా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓలు వసుధ, నాగార్జున పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన జి.రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందించారు. దాతకు దేవస్థానం తరఫున స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేసి సత్కరించారు.



దాతను బాండ్ అందజేస్తున్న ఆలయ అధికారి

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రాజమోహన్‌రెడ్డి



మిడుతూరులో మాట్లాడుతున్న ఏడీఏ విజయశేఖర్

ఆత్మకూరు: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రాజమోహన్‌రెడ్డి కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తుందని, జింక్, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాలను కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. రబీలో సాగు చేసిన పంటలను ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఏఓ విష్ణువర్ధన్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు పంటలను నమోదు చేయించుకునేలా ఆర్‌బీకే సిబ్బంది చూడాలని ఏఓ కె.మహేష్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ జమ కాని లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు.


మిడుతూరు : రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి శనగలను కొనుగోలు చేయాలని రైతులు కోరారు. శుక్రవారం స్థానిక ఆర్బీకేలో నందికొట్కూరు వ్యవసాయ సహాయ సంచాలకులు విజయశేఖర్ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పరికరాలు, డ్రిప్‌లపై అవగాహన కలిగించారు. అనంతరం పీరుసాహెబ్‌పేట, చౌట్కూరు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు నిర్వహించి సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. ఏఓ పీరునాయక్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: రబీలో పంటలు సాగుచేసిన రైతులు తమ పంటలను తప్పనిసరిగా ఈ- క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి స్వామి తెలిపారు. శుక్రవారం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ- క్రాప్ చేసుకోవడానికి ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే గడువుందని చెప్పారు. చైర్మన్ కృష్ణమల్లారెడ్డి, పశు వైద్యాధికారి అనూష పాల్గొన్నారు.

నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలి

మహానంది: పంటల సాగులో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సలహాలు తీసుకుంటూ, నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుక్కాపురం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని చెప్పారు. భూసార పరీక్షలకనుగుణంగా ఎరువుల వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు.

సింగోటం జాతరకు ప్రత్యేక బస్సులు



జూపాడుబంగ్లా: నందికొట్కూరు ఆర్టీసీ డిపో నుంచి తెలంగాణ రాష్ట్రంలోని సింగోటం జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు నెహ్రూనగర్ నుంచి కర్నూలు, కొల్లాపూర్, పెబ్బేరు మీదుగా సింగోటం జాతరకు బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. భద్రతలేని వుట్టీలలో ప్రయాణం వద్దని, సురక్షితంగా ఆర్టీసీ జాతరకు వెళ్లిరావాలని కోరారు.